రచన : జనవరి 2003

# పొగమంచు

జ్ఞాపకం రాని జ్ఞాపకంలా అతను నా ఎదురుగా నించున్నాడు... 'నీ ఆలోచనల్ని సానబెట్టి నా జ్ఞాపకాన్ని చెక్కు చూద్దాం' అన్నట్టు... పొగలాగా నా ముందు... అతను...

'మీ జ్ఞాపకం లేదండీ మనం విడి పోయి యుగాలైనట్టుగా వుంది' అన్నాను...

'అయినా మనం కొన్ని యుగాలుగా కలుస్తూనే వున్నాం... నిన్ననే కిళ్ళీ కొట్టు కింద కుంటి కుక్కను కాల్తో తన్నినప్పుడు నేనెదురు వచ్చాను కదా....'

ఇలా యిన్న వేలసార్లు విడిపోయి జ్ఞాపకం రాని జ్ఞాపకంగా మిగల్డమెందుకో అనుకున్నా...

'అదే విచిత్రం... నా నించీ నువ్వు విడిపోయీ, నీ నించీ నే తోసేయబడి... మళ్ళీ కలవడం జరుగుతూనే వుంటుంది... కలిసిన ప్రతిసారీ నీకీ అలజడి తప్పదు....' అన్నాడు అతను – నా ఆలోచన విన్నట్టు...

'అలజడి కలిగించేందుకే నన్ను కలుస్తారా మీరు?' అడిగా.

'కాదు కాదు మనం కలిసినప్పుడు, మనం విడిపోయి వున్నాం ఇంతవరకూ అన్న విషయ స్పృహ నీలో అలజడికి అసలు కారణం' అని మాయమై పోయాడతను...

శరీరంలో యేదో చాలా పెద్ద శకలం మాయమైన అనుభూతి.....

అది.... ఆ శకలం శరీరందా?

లోపలి అశరీర శకలమా?

గుండె మీద చెయ్యి వేసుకున్నా...

చొక్కా జేబిలో ఓ కాగితప్మడత చేతికి తగిలింది...

తీసా....

తాటాకు రంగు కాగితమది....

మడతలు మూడుగా వున్నాయి....

మూడు మడతలూ మెరుపు వెల్లుల్లో వున్నాయి....

ఆ మూడు మడతల మెరుపు మడ తల కాగితాన్ని విప్పా....

ఇద్దరు సూర్యులుగా.... రెండు సంధ్య ల నడుమ ఆకాశ భాషలో వ్రాసుంది....

నిన్న, ఈ రోజూ, రేపూ మూడింటినీ కలిపి ఈ పురాతనమైన నేలను గాయ పరుస్తున్నావు...

గాయపడిన నేల గతించిన ఆత్మల కాళ్ళతో ఎర్రటి కన్నీళ్ళు కారుస్తోంది....

ఆ విషయ స్పృహ నీకు ఖచ్చితంగా వుంది....

నీ దరిద్రపు ధ్యాన చింతనలో

నీ అశాంతిని యింకొకళ్ళ నెప్పిగా అనువదించి

ఈ అడవుల్ని నగ్నం చేస్తూ

చీకటి పరిమళాలు పేలుస్తున్నావు....

ఉంటాను ఈ క్షణానికి సెలవు...

మళ్ళీ నీ అలజడి నాకవసరమైనప్పుడు కలుసుకుందాం....

* * *

స్కూటర్స్టార్టేసుకుని వేగంగా వెనక్కి తిరిగి చూడకుండా కదిలా....

రైల్వేస్టేషన్ రోడ్లో లెనిన్ మామిడిపళ్ళు కొంటూ కనిపించాడు...

హమ్మయ్య - ధైర్యమొచ్చింది....

లెనిన్‌కు ఆ పొగమంచుగాడి గురించి చాలాసార్లు చెప్పా. చెప్పిన ప్రతిసారీ అస్సలు విననట్టే వుంటాడు... అసలు ఆ క్షణాన చెవిటి వాడిలా అయిపోతాడు....

స్కూటరాపి వెనక్కి చూసుకున్నా... ఆ పొగమంచు వాడు లేడు...

లెనిన్ని భుజం తట్టి పిలిచా...

'ఆ ఇంటికేనా... నువ్వూ తీసుకో బావున్నాయ్ బేనిషాంలు' అన్నాడు...

'అదికాదు లెనిన్ వాడు మళ్ళీ కన్పిం చాడు' - భయంగా - అన్నాను.

'డజను నూట నలభై చెబుతున్నాడు .... నువ్వో ఆరు తీసుకుంటావా?' లెనిన్....

సాయంకాలం ఆరున్నరైంది. ఆ పళ్ళ వాడు అయినకాడికి అమ్ముకుని వెళ్ళి పోవాలి... పక్కన పల్లెనించీ వస్తారు వాళ్ళు.....

'అది కాదు లెనిన్ వాడూ...'

మామిడిపళ్ళ బుట్టవాడు నావేపు ఆశగా చూట్టంతో పొగమంచు వాడి జ్ఞాపకం క్రమంగా కరిగిపోయింది....

'నూట నలభై యెందుకు లెనిన్... నిన్న మా బామ్మర్ది ఎనభైకే తెచ్చాడు యింతకి ఒకటిన్నరైట్లున్నాయి సైజులు....'

వేసా విషం చుక్క లెనిన్ తల్లోకి...

లెనిన్ నా వేపు అనుమానంగా చూసి నట్టనిపించింది...

'ఆఁ అయినా ఉదయం నించీ ఎండకెండి మగ్గిపోయాయి. రేపుదయాన్నే కూరలకొస్తాం కదా అప్పుడు పట్టుకెళ్దాం'

రెండో విషపు చుక్క...

'అంతేనంటావా?' లెనిన్ కదల సాగాడు.

'సార్ సరిగ్గా పద్మూడు పళ్ళు మిగి లినయి... మీరు తీసుకుంటే నేను గంపెత్తుకు వెళ్ళిపోతాన్సార్.'

వాడి అసహాయత గుర్రపు కళ్ళెంలా చేతికందింది....

చేసేయ్ స్వారీ... అని వికటంగా నవ్వుకుని, నూరు రూపాయల్కి ఆ మిగిలిన పదమూడు పళ్ళూ కొని కదిలాము...

ఓ పదడుగులు వెళ్ళి స్కూటర్ స్లో చేసి ఆ పళ్ళవాడివేపు గర్వంగా చూద్దామని వెనక్కు తిరిగా...

గంపను చేత్తో పట్టుకుని వాడు... పళ్ళ వాడు కాదు... వాడే పొగమంచు వాడు నా వేపు పళ్ళు తెరిచి నవ్వుతూ కనిపిం చాడు...

జేబి తడుంకున్నా...

మూడు మెరుపు మడతల తాటాకు రంగు కాగితం జేబిలో లేదు...

కానీ వుంది....

జేబిలో కాదు.... ఎక్కడో దాని కింద యింకా లోపల లోతుల్లో...

మళ్ళీ ఓ మాటు భయంగా వెనక్కు చూసా....

పొగ మామిడిపళ్ళ మంచు వాడు బుట్టతో సహా మాయమయ్యాడు...

* * *

ఇంటికి...

వరండాలో సుభద్ర భద్రంగా....

టీపాయ్ మీద సన్నజాజుల కుప్ప నన్ను చూసి నవ్వింది...

'పూలు కొన్నావా?' పళ్ళికిలిస్తూ అడిగా...

'ఆహా.... లేదు పూలమ్మనింటోకి పిల్చి దానికి మత్తుమందిచ్చి దొంగిలించా... కొన్నావాట కొన్నావా? ఈ రోజుల్లో మొగుడితో సహా అన్నీ కొనాల్సిందే'.

లక్షన్నర కట్నం కసక్కున గుచ్చుకుంది... స్కూటర్ పొట్ల గిత్తలా కుమ్మడానికి సిద్ధంగా వున్నట్టన్పించింది...

సన్నజాజులు టీపాయ్ మీంచి విక వికా నవ్వాయి...

బట్టలు మార్చుకోబోతూండగా...

మళ్ళీ అందమైన భద్రకాళి ప్రత్యక్ష్యం...

ఆగు, అన్నట్టు చెయ్యెత్తి కాఫీ గ్లాసు చేతుల్లో కుక్కి, 'అప్పుడే బట్టలూడదీసుకుని ఆ టీవీ ముందు కూలబడకు, లక్ష్మి డెలివరీ అయ్యిందిట కల్యాణి నర్సింగ్హోం... వెళ్ళాలి'

హుకుం నామా...

'ఇహ్హి...హీ...' అనికిలించి, కాఫీగ్లాసు పట్టుకుని సోఫాలో కూలబడ్డా...

'మామిడి పళ్ళెంతా?' ఎంత తగలేసావ న్నట్టడిగింది...

'నూట నలభై డజను, ముందు నూట తొంభై అని చివర్కి నూట నలభైకిచ్చాడు' గర్వంగా అన్నా... అని సుభద్ర మొహం లోకి చూశా...

ఆశ్చర్యంగా... నా కళ్ళని నేనమ్మలేనట్లు అక్కడ సుభద్ర స్థానంలో మంచు పొగవాడు... నవ్వుతూ... మంచు సుభద్ర పొగవాడు... మామిడి... భద్రం చుపొగసు వాడు...

తల విదుల్చుకున్నా...

తాళాల గుత్తి ఒళ్ళో పడితే మళ్ళీ తలెత్తి చూసా...

పొగమంచు వాడెళ్ళిపోయాడు... సుభద్రే...

'పక్కింట్లో పాలు పోయించుకోమని చెప్పొస్తా... తాళాలు వేసెయ్... ఆ గ్రిల్లుకి పెద్దతాళం తగలేయ్.'

* * *

లక్ష్మికి బాబు; చిన్న ఎలక పిల్లలా వున్నాడు....

అయితేనేం... మొదట పాప, యిప్పుడు బాబు...

మొహం నిండా ఆనందాన్నీ, గర్వాన్నీ ఆవిష్కరించుకుని పడుకునుంది....

సుభద్ర బాబుని సున్నితంగా తాకింది...

'ఆహాఁ యాహీఁ' మాటలు ఓ అయిదు నిముషాలపాటు సాగాయి... నే బైట నిలుచున్నా... మాటలు వినబడ్తు న్నాయి...

'కాదే భద్రం... మూడేళ్ళు దాటాయి కదా... యింకా ఎన్ని రోజులూ? యిద్దరూ టెస్ట్ చేయించుకోకూడదూ. ఈ నర్సింగ్హోం లో అన్నీ చేస్తారు...'

'యింకా మూడేళ్ళే కదే లక్ష్మి... మేమే ఆగాం...'

ఎన్ని టెస్టులు... ఎంత అవమానం... ఎంత ఖేదం...

ఇద్దర్లోనూ లోపముంది... కష్టమే...

బ్లాక్డ్ ఫెలోపియన్ ట్యూబ్స్.... డీ అండ్ సీ...

స్పెర్మ్ కౌంట్ నాటెటాల్ సఫీషియంట్ ఫార్ ఇంప్రెగ్నేషన్...

చూద్దాం... చూద్దాం...

బైటికొచ్చింది సుభద్ర...

ఇద్దరం ఒకర్నొకరు ఓ మాటు చూసుకున్నాం...

మా యిద్దరి మధ్యనించీ ఓ పొగ మంచు రూపం నడచి వెళ్తూ... ఓ మాటు ఆగి వెనక్కి తిరిగి మళ్ళీ మాయమై....

మమల్ని జాలిగా చూసిందా ఆ రూపం...?

లోకమంతా పొగమంచు...